గృహలక్ష్మిపై అస్పష్టత..

- గడువు ముగిసిందంటున్న అధికారులు
- దరఖాస్తుల స్వీకరణకు నిరాకరణ
- నిరంతర ప్రక్రియ అంటున్న ప్రభుత్వం



కరకగూడెం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు(ఫైల్)

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకం అమలులో అస్పష్టత చోటుచేసుకుంటుంది. ఈ పథకంలో ఇళ్ల మంజూరుకు ఈ నెల 10లోగా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన చేశారు. కేవలం మూడు రోజులు ముందుగా 7వ తేదీన అధికారులు ప్రకటన చేశారు. దీంతో అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకునేందుకు మీ సేవా కేంద్రాలకు, మండల పరిషత్ కార్యాలయాలకు క్యూ కట్టారు. అదేవిధంగా అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాల వద్ద, తహసీల్ కార్యాలయాలకు భారీగా తరలివెళ్లారు.

ప్రతిబంధకంగా సర్టిఫికెట్ల ప్రక్రియ..

కొన్ని మండలాల్లో తహసీల్దార్లు బదిలీపై వెళ్లినా కొత్త తహసీల్దార్లు రాలేదు. దీంతో అక్కడ ఉన్న డిప్యూటీ తహసీల్దార్లు సర్టిఫికెట్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థలను ప్రభుత్వం రద్దు చేయటంతో సర్టిఫికెట్ల పరిశీలన బాధ్యత మొత్తం ఆర్‌ఐలపై పడింది. మండలానికి ఉన్న ఒకరిద్దరు ఆర్‌ఐలు వందలాది సర్టిఫికెట్ల పరిశీలన చేయటం తలకు మించిన భారంగా మారింది. మూడురోజుల వ్యవధిలో ఈ ప్రక్రియను పూర్తిచేయటం అధికారులకు తలనొప్పిగా పరిణమించింది. దీంతో వందలాదిమంది సర్టిఫికెట్ల కోసం తహసీల్ కార్యాలయాల వద్ద, మీ సేవా కేంద్రాల వద్ద వేచి చూడాల్సి వచ్చింది.

మూడురోజుల గడువుపై విమర్శలు..

దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజుల గడువు ఇవ్వటంపై విపక్షాలు, ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించినా అధికారులు మాత్రం దరఖాస్తులు స్వీకరణకు నిరాకరిస్తున్నారు. దీంతో దరఖాస్తులు చేసుకోనటువంటి వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. చాలామంది అర్హులైన పేదలు ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కావటంతో దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఇప్పుడు వారు దరఖాస్తులు పట్టుకుని అధికారుల వద్దకు వెళ్తే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తేనే దరఖాస్తులు తీసుకుంటామని చెబుతున్నారు. ఈ పరిస్థితులు అర్హులైన పేదలను గందరగోళపరుస్తున్నాయి. దరఖాస్తుల స్వీకరణపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి అధికారులకు ఉత్తర్వులు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

సర్టిఫికెట్లు తెచ్చుకోవడం సాధ్యం కాలేదు



మూడురోజుల్లో అన్ని సర్టిఫికెట్లు తెచ్చుకోవటం సాధ్యకాలేదు. రెండురోజులు తిరిగితే సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేశారు. ఆ తరువాత తహసీల్ ఆఫీస్‌కు పోతే అక్కడ అదే పరిస్థితి. శుక్రవారం సర్టిఫికెట్లు చేతికందాయి, అవి తీసుకుని మండల ఆఫీసుకు వెళితే నిన్నటితో గడువు ముగిసిందంటున్నారు.

– కె.రమణమ్మ, దరఖాస్తుదారు

గడువు పెంచాలి



ప్రభుత్వం మూడురోజుల గడువిచ్చి గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోమనటం సరికాదు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఈ నెలాఖరు వరకు కొనసాగించాలి. సర్టిఫికెట్లు లేకపోవటంతో చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. సరిపడా సిబ్బంది లేకపోవటంతో సర్టిఫికెట్లు ఆలస్యమయ్యాయి. గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణపై గడువు పెంచాలి.

– పున్నంచంద్, ఎన్డీ నాయకుడు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే



జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే గురువారం వరకు గృహలక్ష్మి దరఖాస్తులు తీసుకున్నాం. శుక్రవారం నుంచి దరఖాస్తులు తీసుకోవటం నిలిపివేశాం, ఉన్నతాధికారులు మళ్లీ దరఖాస్తులు తీసుకోమంటే తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కొనసాగిస్తాం.

– వివేక్‌రామ్, ఎంపీడీఓ, బూర్గంపాడు

క్లుప్తంగా

దళితబంధుకు దరఖాస్తు చేసుకోండి

దుమ్ముగూడెం: పేద దళితుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన దళితబంధు పథకం ద్వారా లబ్ధిపొందేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు కోరారు. శుక్రజువారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, నాయకులు ఎండీ.జానిపాషా, మోతుకురి శ్రీకాంత్, దామెర్ల శ్రీనివాసరావు, పోడియం సుబ్బారావు, జిలకర గంగరాజు, డేగల రవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చేపల సహకార సంఘం కమిటీ ఎన్నిక

మణుగూరు రూరల్: మండలంలోని కూనవరం పంచాయతీలోని గిరిజన చేపల పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వంక అర్జున్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఏనిక కామరాజు, కార్యదర్శిగా ఎలిబోయిన కృష్ణలతో పాటు ఆరుగురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి కార్యాలయం సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్‌ఆర్ హనుమాన్ వ్యవహరించారు. పాలకవర్గానికి సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

దుమ్ముగూడెం: దేశంలో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐసీ ఇర్ సంస్థలలో ప్రవేశం పొందిన కొర్సా లక్ష్మి, ఎనికె లిల్లీరాణిలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సీ స్కూల్‌లో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య ఒక్కో విద్యార్థికి రూ.15వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, భద్రాచలం గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, ఏకలవ్య పాఠశాల హెచ్‌ఎం వీరాస్వామి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి: ఆర్థికసాయం కోసం ఈఆర్‌ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఈఆర్‌ఎస్ పథకంలో పది మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా , ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గంగాజలం, అరుణ పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

దుమ్ముగూడెం: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఈ నెల 19న ఆదివాసీల సంఘాల ఐక్యకార్యచరణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ అధ్యక్షతన ములకపాడు గ్రామంలో ఆదివాసీ సంఘాల ఐక్యకార్యచరణ వేదిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంజా శ్రీనివాస్, సోందె మల్లూరు, కొమరం దామోదర రావు, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, సర్పంచ్ తెల్లం వరలక్ష్మీ, కణితి రాముడు, లక్ష్మణ్, తునికి కామేష్, రాజేశ్వరీ, పొడియం సుబ్బారావు, సోయం నరసింహారావు, కుర్సం లక్ష్మీ, సమ్మక్క, మడకం భూపతి, ధర్మయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీలోని తంగెళ్లగుంపు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ మేరకు ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ 38,140 నగదు, ఐదు బైక్‌లు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామారావు తెలిపారు. ఈ దాడిలో కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు సుమన్, ప్రవీణ్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకోని ప్రభుత్వం



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

గుండాల: ఇటీవల భారీ వర్షాల కారణంగా అనేక గ్రామాలు ముంపునకు గురై సర్వం కోల్పోయిన కుటుంబాలను నేటి వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని ముంపు గ్రామాలను సందర్శించారు. గుండాల మండలంలో సాయనపల్లి, నర్సాపురం, ముత్తాపురం, ఆళ్లపల్లి మండలంలో రాయిపాడు, ముత్తాపురం గ్రామాలను సందర్శించి, సర్వం కోల్పోయిన బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలు పడి ఇరవై రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి సాయం అందించక పోగా కనీసం అధికారులతో జరిగిన నష్టాన్ని సర్వేలు చేయించలేదన్నారు. ఈ సందర్భంగా ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేసు ఎల్లయ్య, ఆయా మండలాల కార్యదర్శులు వాగబోయిన రమేష్, గొగ్గెల క్రిష్ణయ్య, గడ్డం శ్రీను, ఎస్‌కె.షాహెద్, చిన్న సమ్మయ్య, ఆదినారాయణ, రవివర్మ, హరీష్, నాసిర్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపల్లి మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ కాపు సంఘం నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు (పెద్దకాపు) లేనిలోటు తీర్చలేనిదని భద్రాద్రి శ్రీ కృష్ణదేవరాయ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని నందిని రెసిడెన్సీలో వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ... భద్రాద్రి డివిజన్‌లో కాపు సంఘం అభివృద్ధికి ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకట్రావు, నక్కా ప్రసాద్, తాళ్లపూడా రాము, కొండిశెట్టి నాగేశ్వరరావు, నరసింహారావు, వెంకటరత్నం, రామలింగేశ్వరరావు, వెంకటరత్నం నాయుడు, ప్రభాకర్, జోగారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

భద్రాచలంఅర్బన్: దాడి ఘటనలో ఒకరిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. టౌన్ ఎస్సై పీవీఎన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన సాయి పవన్ వృత్తి రీత్యా రాడ్డు బెండింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సాయి పవన్ శుక్రవారం మధ్యాహ్నం పనులు ముగించుకుని వస్తుండగా రషీద్ అనే వ్యక్తి గతంలో వీరిద్దరి మధ్య జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకుని సాయి పవన్‌ను దూషిస్తూ దాడి చేసి చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు సాయిపవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు జాతీయ జెండాలను పట్టుకొని హర్ ఘర్ తిరంగ బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో కేవలం రూ.25 చెల్లించి జాతీయ జెండాను పొందే అవకాశం ఉందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై కేసులు నమోదుచేయాలి

దుమ్ముగూడెం: మండలంలో అక్రమ బహుళంతస్తుల నిర్మాణాలపై తక్షణమే ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పరిషత్ ఆధ్వర్యంలో డీటీ మణిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతర్లు ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా క్రయవిక్రయాలు, బహుళంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడినటువంటి గిరిజనేతరులపై ఒక్క కేసు నమోదు కాలేదన్నారు. జిల్లా అధ్యక్షులు తెల్లం నరసింహారావు, మండల కన్వీనర్ రేసు ఆదినారాయణ, మండల కార్యదర్శి చంద్రయ్య పాల్గొన్నారు.

ఆదివాసీలపై నోరుజారితే సహించం..

ఆదివాసీలపై అవమానకరంగా మాట్లాడితే సహించేది లేదని తీవ్ర పరిణామాలు తప్పవని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు హెచ్చరించారు. మండలంలోని ములకపాడు గ్రామంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావుపై లంబాడీలు అనుచితంగా మాట్లాడి ఆదివాసీ నాయకులను అవమానించారన్నారు. పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు, మండల కన్వీనర్ రేసు ఆదినారాయణమూర్తి, నాయకులు కొరస రామచంద్రయ్య, రేసు జానకిరామయ్య, మురళి, రమేష్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి



దుమ్ముగూడెం: నిల్వనీటిని పారబోస్తున్న సిబ్బంది



మణుగూరు రూరల్ : దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు పుల్లారెడ్డి సూచించారు. శనివారం దుమ్ముగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఆరోగ్య శిబిరం, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా నిల్వనీటిని తొలగించారు. వర్షాకాలం కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మొబైల్ డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కూనవరం సర్పంచ్ ఏనిక ప్రసాద్ సూచించారు. మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో రేగులగండి గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యాధికారి శివకుమార్ వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, లక్ష్మీ,శారద, నీల, నాయకులు వల్లభనేని రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'నా మట్టి–నా దేశం'



భద్రాచలంటౌన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, నాయకులు

దుమ్ముగూడెం : మండలంలోని డి.కొత్తగూడెం పాఠశాలలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మట్టి దీపంతో సామూహిక ప్రతిజ్ఞ శుక్రవారం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తెల్లం శేఖర్, మండల కార్యదర్శి కుర్సం వసంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెంలో..

రిటైర్డ్ జవాన్‌కు సత్కారం

భద్రాచలంటౌన్: భద్రాచలం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రిటైర్డ్ జవాన్ వెంకటేశ్వరరావును సత్కరించారు. అనంతరం సిదార్థ స్కూల్‌లో భాగంగా మట్టి దీపంతో సామూహిక ప్రతిజ్ఞ విద్యార్థులతో కలిసి నిర్వహించారు. బోడ సత్యనారాయణ, ములిశెట్టి రాంమోహన్‌రావు, కోటేశ్వరి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, జయరాజు, శ్రీనివాసరావు, సమీరా, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సుకృత

చండ్రుగొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఈ మేరకు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత సూచించారు. మండలంలోని మహ్మద్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ప్రతిశుక్రవారం నిర్వహించే డ్రైడేను పరిశీలించారు. గర్భిణులను ఎప్పటికప్పుడు పరీక్షలు చేయాలని మండల వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమరంలో మండల వైద్యాధికారిణి కనకం తనుజా, సిబ్బంది పద్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

పినపాక: ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యా, వైద్యం, ఉపాధితోనే సమాజాభివృద్ధికి బాటలు పడతాయని ఈ బయ్యారం సీఐ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం రోజు గ్రామమైన చింతలపాడులో పర్యటించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ యువత విద్యా, ఉపాధి కోసం కృషి చేయాలన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దన్నారు. అనుమానితులు ఎవరైనా గ్రామంలోకి ప్రవేశించినప్పుడు తమకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగుల్ మీరా, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పివికాలనీలో ఖాళీగా ఉన్న ఎంసీ స్పెషల్ డీ, డీ, డీ–2, ఎంసీ క్వార్టర్ల కేటాయింపునకు శుక్రవారం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 57 క్వార్టర్లకు గాను 121 మంది దరఖాస్తు చేసుకోగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించి క్వార్టర్లను కేటాయించారు. వీరికి సీనియార్టీ పరిగణలోకి తీసుకుని క్వార్టర్లను కేటాయించినట్లు ఏరియా ఎస్‌ఓటు జీఎం ఈసం కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, ఈఈ(సివిల్) డీపీఎస్‌ఎన్ ప్రవీణ్, టీబీజీకేఎస్ నాయకులు వీరభద్రం, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, జూనియర్ అసిస్టెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

లఘు ఉద్యోగభారతి కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

భద్రాచలంఅర్బన్: లఘు ఉద్యోగ భారతి నూతన జిల్లా కమిటీ ఎన్నికను పట్టణంలో గల లయన్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చరణ్ దేశ్ ముఖ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ బి. అనిల్ కుమార్ సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బి.చలమారెడ్డి, జనరల్ సెక్రటరీగా పి.నాగభూషణ శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా ఇంగువ రమేష్, రాజేశ్వర రెడ్డి(నాని), గోపాలకృష్ణ, జాయింట్‌సెక్రటరీగా రాజశేఖర్, సెక్రటరీగా పున్నారెడ్డి, ఈసీ మెంబర్లుగా కొండారెడ్డి, శ్రీలతలను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీచరణ్ మాట్లాడుతూ.. లఘు ఉద్యోగ భారతిశెలో దేశ వ్యాప్తంగా 35,000 మంది సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల యజమానులు సభ్యత్వం కలిగి ఉన్నారని, సూక్ష్మ తరహా పరిశ్రమల వారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందాలని ఆయన సూచించారు.రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామకృష్ణ, కె. కొండా రెడ్డి, శివారెడ్డి, సంజీవ్ రెడ్డి, జిటిఆర్ తదితరులు పాల్గొన్నారు.

బినామీలను అడ్డుకునేందుకు సహకరించాలి



దమ్మపేట: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం మద్యం టెండర్లలో, గౌడ కులస్తులకు ప్రకటించిన రిజర్వేషన్ షాపులకు బినామీలు టెండర్లు వేయకుండా అడ్డుకునే విషయంలో సహకారం అందించాలని గౌడసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మద్యం షాపుల టెండర్లలో బినామీల పాత్ర లేకుండా చూడాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు సంఘం తరపున శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను గౌడ సంఘం సభ్యులు కలశారు. ఈ కార్యక్రమంలో కాసాని నాగప్రసాద్, పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, పానుగంటి చిట్టిబాబు, యార్లగడ్డ శ్రీను, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

ముల్కలపల్లి : ఇటీవలే తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గుడ్ల పుల్లారావు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును తాటిసుబ్బన్నగూడెంలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక భూవిషయాలపై ఎమ్మెల్యేతో ఆయన చర్చించారు. ఆయనతోపాటు తహసీల్దార్ తారాచంద్ ఉన్నారు.

పెనాల్టీ నిబంధనను రద్దు చేయాలి



మాట్లాడుతున్న మంగీలాల్

మణుగూరు రూరల్ : అనివార్య కారణాలతో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు విధులకు గైర్హాజరైతే సింగరేణి యాజమాన్యం విధిస్తున్న పెనాల్టీ నిబంధనను రద్దు చేయాలని ఇఫ్టూ ఏరియా నాయకులు మంగీలాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఏరియా ఇన్‌చార్జ్ జీఎంకు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, విధులకు గైర్హాజరు అయితే యాజమాన్యం వారికి పెనాల్టీ విధించడం సరికాదన్నారు. ప్రతీ నెల 10లోగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ప్రసాద్, వీరాచారి, డాలమ్మ, లక్ష్మయ్య, నరసింహరావు, సుందర్‌లాల్, నరేష్, శ్రీను, యోహాన్ నాయకులు పాల్గొన్నారు.